క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీకే మా మద్దతు



ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన సిహెచ్.అగ్రహారం గ్రామస్తులు

పూసపాటిరేగ: మండలంలోని సిహెచ్.అగ్రహారంలో కొంత కాలంగా మౌనంగా వున్న గుడివాడ శ్రీనివాసరావు, గుడివాడ జయరాంతో పాటు పలు కుటుంబాలు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సమక్షంలో మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి ఎమ్మెల్యే అప్పలనాయుడు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధిని చూసి తాము వైఎస్సార్‌సీపీలో చేరినట్లు ప్రకటించారు. రాబోయే ఎన్నికలలో తాము వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చి సీఎంగా జగన్ మోహన్‌రెడ్డి గెలుపునకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ ఎస్.సత్యనారాయణరాజు, సర్పంచ్ కొత్తకోట శ్రీరాములు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండలో వ్యాయామశాల ప్రారంభం

విజయనగరం రూరల్: మండలంలోని కోరుకొండ గ్రామంలో ఎంపీ ల్యాడ్స్, మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన వ్యాయామశాలను ఎంపీపీ మామిడి అప్పలనాయుడు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ధృఢత్వం కలుగుతుందన్నారు. యువతను క్రీడల్లో ప్రోత్సహించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల ఆడుదాం ఆంధ్రా వంటి కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించారన్నారు. శారీరంగా ధృడంగా ఉంటే ఉద్యోగవకాశాలు పొందవచ్చని అన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కృషితో నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధిలో ముందంజ వేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, సర్పంచ్ ఎం.శంకర్, ఎంపీటీసీ సభ్యురాలు పత్రి నాగమణి, మాజీ సర్పంచ్ లగుడు శివాజీ, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

భమిడిపాటికి జ్యోతిష్య శిరోమణి అవార్డు

విజయనగరం టౌన్: ప్రముఖ జ్యోతిష్య పండితులు, జిల్లా బ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు భమిడిపాటి రామ్‌కుమార్ శర్మకు ఘన సత్కారం దక్కింది. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఆర్యన్ ఆస్ట్రాలజీ రీసెర్చ్ సెంటర్ ఫౌండర్ డాక్టర్ సి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో జ్యోతిష్య శిరోమణి అవార్డు, ప్రశంసపత్రాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడుతూ హైందవ సనాతన ధర్మాన్ని యువత పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అవార్డు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సమాఖ్య ప్రతినిధులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

అమ్మవారి ఆధ్యాత్మిక సేవలో తరించండి

- పైడితల్లి ఆలయ ఈఓ ప్రసాదరావు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారిని స్తుతిస్తూ వివిధ రకాల ఆధ్యాత్మిక సేవల్లో తరించాలని ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీవీ ప్రసాదరావు పేర్కొన్నారు. స్థానిక మూడులాంతర్లు వద్ద నున్న చదురుగుడి ఆవరణలో మంగళవారం రాత్రి శ్రీవారి స్వచ్ఛంద సేవా సంఘం వ్యవస్థాపకులు ఎమ్.భీష్మారావు సారథ్యంలో నిర్వహించిన భక్తి గీతాలాపన ఆద్యంతం ఆకట్టుకుంది. అమ్మవారిని కీర్తిస్తూ గాయకులు తమ గానామృతంతో భక్తులను అలరించారు. గంటన్నర సేపు నిర్వహించిన కార్యక్రమాన్ని ఈఓ లాంఛనంగా ప్రారంభించారు. ప్రతీ మంగళవారం రాత్రి ప్రత్యేక భక్తి గీతాలాపన, ఉపన్యాసం, వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్నవారు తమను నేరుగా సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో పైడిమాంబ కళానికేతన్ వ్యవస్థాపకులు ఆర్.సూర్యపాత్రో, పూర్వ ఈఓ భానురాజా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధి కోర్సులలో మహిళలకు ఉచిత శిక్షణ

విజయనగరం అర్బన్: నిరుద్యోగ యువతులకు ఉపాధి కలిగించే పలు కోర్సులకు ఉచిత శిక్షణా తరగతులను స్థానిక మహిళా ప్రాంగణంలోని స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ వసతిగృహంలో నిర్వహిస్తామని సంస్థ డైరెక్టర్ జీవీవీ రమణ మంగళవారం తెలిపారు. మహిళలకు ఉమెన్స్ టైలరింగ్, కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్, మగ్గం వర్క్ కోర్సులపై శిక్షణ ఉంటుందని తెలిపారు. వసతి, భోజన సౌకర్యాలను ఉచితంగా కల్పించే ఈ కోర్సులకు తెల్లకార్డుదారులు, 45 ఏళ్లలోపున్న గ్రామీణ ప్రాంత మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన వారికి ఈ నెల 18వ తేదీ నుంచి 30 రోజుల పాటు శిక్షణ ఉంటుందని అన్నారు. ఈ నెల 16వ తేదీ లోపు దరఖాస్తులను కార్యాలయానికి పంపాలని కోరారు.

అక్కచెల్లెమ్మలకు జగనన్న బాసట

- ఆర్థిక సాధికారత దిశగా అడుగులు
- అన్ని పథకాలలో మహిళలకే ప్రాధాన్యం
- ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ సురేష్‌బాబు



మహిళలకు వైఎస్సార్ చేయూత చెక్కు అందజేస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స తదితరులు

పూసపాటిరేగ: అక్కచెల్లెమ్మలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాసటగా నిలుస్తున్నారని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు అన్నారు. పూసపాటిరేగ సచివాలయం - 2 వద్ద మంగళవారం జరిగిన వైఎస్సార్ చేయూత నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. పూసపాటిరేగ మండలంలో 5393 మహిళలకు రూ.10.18 కోట్లు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు విడతలలో 5393 మంది మహిళలకు రూ.36.70 కోట్ల నగదును మహిళల అకౌంట్‌లో జమ చేసినట్లు తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం 45 సంవత్సరాలు నిండిన మహిళలకు నాలుగు విడతలలో ఏడాదికి రూ.18,750 చొప్పున రూ.75 వేలు జమ చేశారన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, ఆడపడుచుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేసామని ప్రజాసేవే పరమావధిగా ముందుకు సాగుతున్నామని వివరించారు. పేదలకు మేలు జరిగితే చంద్రబాబు ఓర్వలేరని, అందుకే అసత్య ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. ఎల్లో మీడియా సహకారంతో ప్రభుత్వంపై కుట్రలు చేస్తున్నారన్నారు. భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డు ఎయిర్‌పోర్టుతో నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. రామతీర్థసాగర్ రిజర్వాయరు నిర్మాణం పూర్తయితే నియోజకవర్గంలో 24,710 ఎకరాలు సస్యశ్యామలం అవుతాయన్నారు. విజయనగరానికి తాగునీరు అందుతోందన్నారు. వైఎస్సార్‌సీపీకి సంక్షేమ పథకాలు లబ్ధి పొందిన అక్కచెల్లెమ్మలే స్టార్ క్యాంపెయినర్‌లు అన్నారు. ముందుగా వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గం పరిశీలకుడు నెక్కల నాయుడుబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీపీ మహంతి కల్యాణి, జెడ్పీటీసీ మహంతి సీతాలక్ష్మి, ఎంపీడీఓ ఎం.రాధిక, తహసీల్దార్ ప్రవల్లిక ప్రియ, ఏసీ రాజ్‌కుమార్, ఏపీఎం పెంటంనాయుడు, వైస్ ఎంపీపీలు ఎస్.సత్యనారాయణరాజు, అల్లాడ రమేష్, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, గుజ్జు సురేష్‌రెడ్డి, పడాల శ్రీధర్, టి.సీతారాం, దాడిశెట్టి త్రినాధరావు, బర్రి చినఅప్పన్న, దేశెట్టి గణేష్, చాపల సత్తిబాబు, వాసుపల్లి అప్పన్న, ఎడ్ల రామకృష్ణ, మహంతి లక్ష్మణరావు, బొడ్డు ఎల్లాజీ, శాంతాటి శ్రీనివాసరావు, తాడిశెట్టి బాబు, కొత్తకోట శ్రీరాములు, పి.మధు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన మహిళలు

వలంటీరు వ్యవస్థ దేశానికే ఆదర్శం



మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తదితరులు

- ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ

పూసపాటిరేగ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన వలంటీరు వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. పోరాం గ్రామంలో సంక్షేమ పథకాల అమలుపై వలంటీర్లతో మంగళవారం సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తున్న వలంటర్లను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. వలంటీరు వ్యవస్థ వున్నందునే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసి న్యాయం చేయగలిగాం అన్నారు. వలంటీర్ల సేవలను చూసి చంద్రబాబుతో పాటు టీడీపీ నాయకులకు వణుకు పుడుతుందన్నారు. సీఎంగా చంద్రబాబు వున్న 14 సంవత్సరాలు కాలంలో ఈ విధమైన సంక్షేమ పథకాలు ఒక్కటైనా అమలు పరిచారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, నియోజకవర్గం పరిశీలకులు నెక్కల నాయుడుబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, జెడ్పీటీసీ మహంతి సీతాలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసురావు, వైస్ ఎంపీపీ ఎస్.సత్యనారాయణరాజు, ఎ.రమేష్, ప్రజాప్రతినిధులు మహంతి జనార్దనరావు, దాడిశెట్టి త్రినాధరావు, బర్రి చినఅప్పన్న, పి.లక్ష్మీనారాయణ, కోట్ల రఘు, పబ్బిరెడ్డి అప్పడుదొర తదితరులు పాల్గొన్నారు.

సమస్యను సానుకూలంగా పరిష్కరించుకోవాలి

- కలెక్టర్ నాగలక్ష్మి



గ్రామస్తులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

భోగాపురం: గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రజలందరూ కలిసి సానుకూలంగా పరిష్కరించుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి ముంజేరు సిద్ధార్థ కాలనీ వాసులకు సూచించారు. గతంలో మండలంలోని ముంజేరు గ్రామం సిద్ధార్థ కాలనీ సమీపంలో అధికారులు చేపట్టిన కాలువ నిర్మాణ పనులను కాలనీ వాసులు అడ్డుకున్న విషయం తెలిసిందే. దీంతో ముంజేరు గ్రామ ప్రజలు, సర్పంచ్ పూడిక నూకరాజు కలిసి కాలువ నిర్మించాలంటూ స్పందనలో పలుమార్లు సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో కలెక్టర్ నాగలక్ష్మి మంగళవారం ఆర్డీఓ సూర్యకళ, ఎస్పీ ఎం.దీపికలతో కలిసి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ముంజేరు గ్రామస్తులు, సిద్ధార్థనగర్ కాలనీ వాసులతో కలిసి కాలువ నిర్మాణంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ గతంలో వాడుక నీరు ఏ విధంగా పోయేదో ఆ మార్గంలోనే కాలువను నిర్మించాలని కోరారు. ప్రస్తుతం మురుగునీరు రోడ్డుపై నిల్వ ఉండటం వలన కాలనీ వాసులు అంటు రోగాల బారిన పడుతున్నామన్నారు. దీనికి ముంజేరు గ్రామస్తులు స్పందిస్తూ గతంలో గ్రామంలోని వాడుకనీరు ఆరు కాలువల ద్వారా బయటకు పోయేదని, ఇంకా కొంత నీరు రైతుల జిరాయితీ భూముల్లోకి పోతుండేదని చెప్పారు. అప్పట్లో జిరాయితీ భూములు ఖాళీగా ఉండేవని.. ప్రస్తుతం అదే జిరాయితీ భూముల్లో రైతులు భవన నిర్మాణాలు చేపట్టడంతో నీరు పోయేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు. ఎవరికి ఇబ్బందులు కలగకుండా సమస్యను పరిష్కరించాలని సర్పంచ్ పూడిక నూకరాజు, గ్రామస్తులు కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ స్పందిస్తూ వీలైతే ప్రభుత్వ భూమిలో నుంచి గానీ, లేదా ప్రైవేటు వ్యక్తుల నుంచి జిరాయితీ భూములను సేకరించి, వాటిలో కాలువ నిర్మించేందుకు అయ్యే ఖర్చు, ప్రణాళికలను తయారు చేసి గ్రామస్తులకు పంపిస్తామన్నారు. ముంజేరు గ్రామస్తులు, సిద్ధార్థనగర్ కాలనీ వాసులు కలిసి మాట్లాడుకుని ఒక నిర్ణయానికి వచ్చి కాలువను నిర్మించుకోవాలని తెలిపారు. అనంతరం రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతిఒక్కరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. డీఎస్పీ గోవిందరావు, ఎన్నికల అధికారి నూకరాజు, ఎంపీడీఓ చంద్రకళ, తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అలుగోలులో కళా వేదిక ప్రారంభం



అలుగోలులో కళా వేదిక శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని అలుగోలు గ్రామంలో రూ.3.50 లక్షల నిధులతో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళా వేదికను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మంగళవారం ప్రారంభించారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం జగనన్న పాలనలో గ్రామాలు అభివృద్ధి పథంలో ఉన్నాయన్నారు. ఏ గ్రామంలో చూసినా ప్రభుత్వ భవనాలు దర్శనమిస్తున్నాయని, తద్వారా ప్రజలకు ఉన్న ఊరిలోనే ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. నియోజకవర్గంలోని మారు మూల గ్రామాలకు రహదారులు ఏర్పాటు చేశామని, మౌలిక వసతులు కల్పించామన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి చిత్త శుద్ధితో కృషి చేస్తున్నామని చెప్పారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాశినాయుడు, వైస్ ఎంపీపీ సారిక వైకుంఠం, పతివాడ సత్యనారాయణ, సర్పంచ్ అలుగోలు బంగారమ్మ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మెన్ జమ్ము అప్పలనాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వారం రోజుల్లో ధాన్యం డబ్బులు

వీరఘట్టం: వారం రోజుల్లో రైతుల ఖాతాల్లోకి ధాన్యం డబ్బులు జమ చేయడం జరుగుతుందని వీరఘట్టం వ్యవసాయశాఖ అధికారి జె.సౌజన్య తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా రూ.40 కోట్లు వరకు ధాన్యం డబ్బులు బకాయిలు ఉన్నాయని, టెక్నికల్ సమస్యల వల్ల ఈ డబ్బులు రైతుల ఖాతాల్లోకి రావడం జాప్యం జరిగిందన్నారు. వేసవిలో నువ్వుల పంట వేసేందుకు ఎక్కువగా రైతులు మొగ్గు చూపుతుండడంతో ఆర్‌బీకేలకు వచ్చే రైతులకు తగు సలహాలు, సూచనలిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కర్రి లీలా ప్రసాదరావు, రైతులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు భారతరత్న ఇవ్వాలి

విజయనగరం: ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి తన ప్రాణాలు త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములుకు భారతరత్న అవార్డు ప్రకటించాలని ప్రముఖ న్యాయవాది, సంఘ సేవకుడు బొడ్డు సత్యనారాయణ అన్నారు. మంగళవారం శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద శ్రీ అమరజీవి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో న్యాయవాది బొడ్డు సత్యనారాయణకు సన్మానించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగ నిరతిని సభికులకు తెలియజేశారు. సంఘం అధ్యక్షుడు ఆలవెల్లి శేఖర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ వద్ద 56 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘం కార్యదర్శి సముద్రాల నాగరాజు మాట్లాడుతూ బొడ్డు సత్యనారాయణ సేవలను కొనియాడారు. అనంతరం పట్టణంలోని పలు సేవా సంఘాలు సభ్యులు న్యాయవాది సత్యనారాయణను సన్మానించారు. సంఘం కోశాధికారి డీమ్స్ రాజు, దాలయ్య శెట్టి, వెత్సా సత్యనారాయణ, మండవిల్లి వెంకటరాజు, ఆకి సూర్యప్రకాష్, ఏడుకొండలు, రాంజీ, ఏ.వీకృష్ణారావు, రామయ్య పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి నిధుల మంజూరు

పూసపాటిరేగ: మండలంలోని కోనాడ గ్రామంలో గల వేణుగోపాలస్వామి దేవాలయం పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ దేవదాయ శాఖ నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఎంతో కాలంగా నిధులు మంజూరుకు కృషి చేశారు. ఎమ్మెల్యే చొరవతో రూ.1 కోటి 25 లక్షలు నిధులు మంజూరు కావడంతో గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు బలగాల కవాతు

డెంకాడ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ముందస్తు ఎన్నికల చర్యల్లో భాగంగా డెంకాడ ఎస్‌ఐ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో కేంద్ర పోలీస్ బలగాలు మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో మంగళవారం కవాతు నిర్వహించాయి. మోదవలస, మోపాడ, డి.తాళ్లవలస, అక్కివరం, చింతలవలస గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో కేంద్ర బలగాలు కవాతు జరిపాయి.

ఏపీటీఎఫ్ మండల కార్యవర్గం

నెల్లిమర్ల: ఏపీటీఎఫ్ మండల కార్యవర్గ ఎన్నిక స్థానిక రామతీర్థం జంక్షన్ స్కూల్‌లో మంగళవారం జరిగింది. సమావేశానికి ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డి.ఈశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి ఎన్‌వి.పైడిరాజు హాజరయ్యారు. కౌన్సిల్ సమావేశం అనంతరం మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడుగా సిహెచ్.ఎర్నాయుడు, అధ్యక్షుడుగా యు.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా కె.బాలకృష్ణ, అసోసియేట్ అధ్యక్షుడుగా వై.కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులుగా కె.అప్పారావు, వి.శ్రీనివాసరావు, అడిషనల్ సెక్రటరీగా పి.మోహన్‌రావు, సెక్రటరీలుగా వై. సుజాత, ఎస్.బాబ్జీ, ఎస్.సింహాచలం ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు.

పరిశ్రమలో కేబుల్ వైర్ల చోరీకి యత్నం

పూసపాటిరేగ: మండలంలోని కందివలస సమీపంలో గల ఎస్ఎంఎస్ పరిశ్రమలో కేబుల్ వైర్ల దొంగతనానికి పాల్పడుతుండగా పరిశ్రమ సెక్యూరిటీ సిబ్బందికి ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. దొంగతనం చేసిన కాపర్ వైర్లు సుమారు రూ.12 లక్షల విలువ ఉంటుందని పరిశ్రమ వర్గాలు తెలిపారు. రణస్థలం మండలం పైడిభీమవరం పరిసర ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులు పరిశ్రమ గోడదూకి వైర్లు కట్ చేసి ఆటోలో లోడ్ చేస్తుండగా సెక్యూరిటీ సిబ్బంది కంటపడింది. దీంతో వారు చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఫిర్యాదు మేరకు పూసపాటిరేగ ఎస్సై సన్యాసినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం జగన్‌తోనే సొంతింటి కల సాకారం

- ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం రూరల్: పేదల సొంతింటి కలలను సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. విజయనగరం మండల పరిధిలోని జొన్నవలస, మలిచర్ల గ్రామాలకు చెందిన 170 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 30 లక్షల పైగా ఇళ్ల స్థలాలను అందించారని అన్నారు. ముఖ్యమంత్రిగా మరోసారి గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఇళ్ల పట్టాలతో పాటు మరో రూ.1.80 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించడం జరుగుతుందన్నారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన సిమెంట్, ఐరన్‌ను రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. నీతి, నిజాయితీ లేని మనిషి చంద్రబాబు అని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అవినీతి రహితంగా పాలన సాగిస్తున్నారని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతీ లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, జొన్నవలస పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్ల త్రినాథ్, ఎంపీడీఓ గంటా వెంకటరావు, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, మండల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ చేయూత రేపు

నెల్లిమర్ల: మండల పరిషత్ ప్రాంగణంలో ఈ నెల 14న గురువారం జరగబోయే వైఎస్సార్ చేయూత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ జి.రామారావు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు.

మళ్లీ అధికారం వైఎస్సార్‌సీపీదే..

- ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- నగరంలో ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



పార్టీ జెండాను ఎగుర వేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

విజయనగరం: ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా రానున్న ఎన్నికల్లో మరల అధికారంలోకి వచ్చేది వైఎస్సార్‌సీపీయేనని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఉద్ఘాటించారు. వైఎస్సార్‌సీపీ విజయనగరం నియోజకవర్గం ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని భగవాన్‌నగర్‌లో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. 13 వసంతాలు పూర్తి చేసుకుని 14వ వసంతంలోకి అడుగిడుతున్న శుభ తరుణంలో ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పార్టీ జెండా ఎగుర వేశారు. మేయర్ వి.విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, ఫ్లోర్ లీడర్ శెట్టివీర వెంకటరాజేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు మన్యాల కృష్ణ, వివిధ డివిజన్‌ల కార్పొరేటర్‌లు మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో పెనుమార్పు

నెల్లిమర్ల: రాజకీయాల్లో పెనుమార్పునకు నాంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావమని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 14వ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక రామతీర్థం జంక్షన్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రామతీర్థం జంక్షన్‌లోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యేతో పాటు నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, నగర పార్టీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కోలగట్ల కృషితోనే నగర అందాలు

విజయనగరం: నగరంలోని ప్రధాన జంక్షన్‌లను అభివృద్ధి చేస్తూ, నగర అందాలను మరింత ఇనుమడింప జేసిన ఘనత శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికే దక్కుతుందని స్థానిక కార్పొరేటర్ దుప్పాడ సునీ, బొంగ భానుమూర్తి పేర్కొన్నారు. స్థానిక అంబేడ్కర్ జంక్షన్‌లో అభివృద్ధి చేసిన వాటర్ ఫౌంటెన్‌ను కోలగట్ల మంగళవారం ప్రారంభించారు. దీంతో ఆ ప్రాంతమంతా ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంది. ఇటీవలే అంబేడ్కర్ విగ్రహం స్థానంలో మరో కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విగ్రహం చుట్టూ వాటర్ ఫౌంటెన్ ఏర్పాటు చేయడంతో ప్రధాన జంక్షన్ ప్రజలను ఆకట్టుకుంటుంది. గతంలో నగరం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండేదని, శాసనసభ్యులుగా కోలగట్ల ఎన్నికైన తర్వాత నగర రూపురేఖలే మారిపోయాయన్నారు. మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి.రాజేష్, నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ తిరుమలరావు, ఇన్చార్జ్ ఈఈ దక్షిణామూర్తి, కార్పొరేటర్లు, యవర్ల కుమారస్వామి పాల్గొన్నారు.

మహిళ ప్రాణాలు నిలిపిన ఘోషాస్పత్రి వైద్యులు



సుజాత ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుంటున్న ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

విజయనగరం ఫోర్ట్: తీవ్ర రక్త హీనతతో ప్రాణప్రాయ స్థితిలో ఉన్న మహిళ ప్రాణాలు ఘోషాస్పత్రి వైద్యులు కాపాడారు. విశాఖపట్నం జిల్లా అనంతగిరి మండలం జాకరవలసకు చెందిన సిరిగం సుజాత అనే గర్భిణి రక్త స్రావంతో ఈ నెల 9న అనంతగిరి పీహెచ్‌సీకి వెళ్లింది. అక్కడ వైద్యులు చికిత్స అనంతరం ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమంగా ఉండడంతో ఈ నెల 10న ఘోషాస్పత్రికి రిఫర్ చేశారు. తీవ్ర రక్తస్రావం కావడంతో ఆమెకు హెచ్‌బీ 4 గ్రాములకు తగ్గిపోయి స్పృహ కోల్పోయింది. ఆస్పత్రికి వచ్చిన వెంటనే ఆధునాతన సాంకేతిక పద్ధతిలో ఆమెకు సిజేరియన్ చేసి వెంటనే 10 యూనిట్లు బ్లడ్, 17 ప్యాకెట్లు ప్లాస్మా, 10 ప్యాకెట్లు ప్లేట్‌లెట్స్ ఎక్కించారు. దీంతో ఆమె కోలుకుంది. మహిళ ప్రాణాలు కాపాడినందుకు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల, సూపరింటెండెంట్ డాక్టర్ అనిలా సునందనిలు వైద్య సిబ్బందిని అభినందించారు.

సీతారాములకు బంగారం, పట్టు వస్త్రాలు



సీతారాములకు బంగారం, పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న కోలగట్ల రమణి

విజయనగరం: నగరంలోని చిక్కాల వీధిలో వేంచేసియున్న సీతారాముల ఆలయాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సతీమణి, మాజీ కౌన్సిలర్ కోలగట్ల రమణి మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సీతారాములకు అరతులం బంగారు ఆభరణాలను, పట్టు వస్త్రాలను సమర్పించారు. డ్రై ఫ్రూట్స్ వంటి కానుకలను అందించారు. పుష్పాలు, ఫలాలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా చిక్కాల వీధిలో సీతారాములు కొలువై ఉన్నారని అన్నారు. కోరిన కోరికలు తీర్చే సీతారాములు అంటే ఈ ప్రాంత వాసులకు ఎంతో నమ్మకమని పేర్కొన్నారు. భక్తి భావంతో తాము బంగారు ఆభరణాలను, పట్టు వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశామని తెలిపారు. కార్యక్రమంలో రత్నాల కనకరత్నం, రెడ్డి పద్మావతి, చిక్కాల వీధి రత్నం తదితరులు పాల్గొన్నారు.